సాక్షి వికారాబాద్

మంగళవారం । 12 । మార్చి । 2024



రక్తమోడుతున్న రహదారి

పూడూరు మండలంలోని హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారి ప్రమాదాలతో రక్తసిక్తమవుతోంది.


8లో▸



అడుగడుగునా లీకేజీలు

మున్నూరు సోమారం గ్రామంలో వందకు పైగా పైప్‌లైన్ లీకేజీలు ఉన్నాయని ఎంపీటీసీ రవీందర్ ఆరోపించారు.

9లో▸



న్యూస్‌రీల్

సత్యనారాయణరెడ్డి నియామకం హర్షణీయం



వెంకట్

కుల్కచర్ల: స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేసిన సత్యనారాయణరెడ్డిని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్‌గా నియమించడం హర్షణీయమని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా స్థానిక సంస్థల ప్రతినిధులకు ప్రాధాన్యం కల్పించడం, వారికి నిధులు కేటాయించడం వంటి అంశాలపై పోరాటం చేసిన వ్యక్తిని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం సంతోషంగా ఉందన్నారు.

బాండ్లను బహిర్గతం చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పరిగి: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పరిగి ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 13వ తేదీలోగా ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను అందజేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని ఆరోపించారు. పేదలకు అన్యాయం చేస్తూ బడాబాబులకు వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. వెంటనే బండ్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు గోవింద్‌నాయక్, సత్తయ్య, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన 'చింపుల'



చేవెళ్ల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇటీవల రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా నియమితులైన చింపుల సత్యనారాయణరెడ్డి కలిశారు. సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయనను కలిసి శాలువతో సన్మానించి వేంకటేశ్వరస్వామి విగ్రహం బహూకరించారు. తనకు అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యా.పోచయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు నగరంలోని ముఖ్యమంత్రి నివాసంలో సోమవారం కలిసి సన్మానించారు.

కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ

కొందుర్గు: ఆర్మీ జవాన్ అశోక్ రెడ్డి వద్ద లంచం తీసుకున్నారంటూ పత్రికలు, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. షాద్‌నగర్ ఆర్‌డీఓ వెంకట మాధవరావు సోమవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రైవేట్ వ్యక్తి హేమంత్‌కుమార్ ప్రభుత్వ పరమైన రికార్డులిచ్చి రైతుల వద్ద డబ్బులు తీసుకోవడం ఏమిటని తహసీల్దార్ రమేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్యను ప్రశ్నించారు. కార్యాలయంలో ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు ఉండగా పహాణీ, ఆర్‌ఓఆర్ పత్రాలు ఇవ్వడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రంజిత్ అస్త్రసన్యాసం!

పోటీకి ససేమిరా..

- కేసీఆర్‌తో ఉమ్మడి జిల్లా నేతల సమావేశానికి డుమ్మా
- తాజాగా మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ పేరు తెరపైకి



మాజీ సీఎం కేసీఆర్‌తో సమావేశమైన ఉమ్మడి జిల్లా నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అస్త్రసన్యాసం చేశారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేదిలేదని తెగేసి చెప్పారు. దీంతో గులాబీ అధిష్టానం పునరాలోచనలో పడింది. సిట్టింగ్ ఎంపీ పోటీకి వెనుకడుగు వేయడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఆఖరికి ఎన్నికల వేళ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వానికి మొగ్గు చూపింది. ఇదే విషయాన్ని సోమవారం జరిగిన నియోజకవర్గ నేతల సమావేశంలో గులాబీ బాస్ కేసీఆర్ ప్రకటించారు. శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తొలుత చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం సమీక్షా సమావేశం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ అధిష్టానం.. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి మరోసారి బరిలో ఉంటారని ప్రకటించింది. కొన్నాళ్లు ఆయన ప్రచారం కూడా నిర్వహించారు. అనంతరం జరిగిన పరిణామాలు ఆయనను పునరాలోచనలో పడేశాయి. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి దంపతులు హస్తం గూటికి చేరడం.. పలువురు దిగువశ్రేణి నాయకులు కారు దిగడం.. ఆత్మరక్షణలో పడేసింది. దీనికితోడు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న మోదీ హవా.. బీజేపీ బలమైన అభ్యర్థిని రంగంలోకి దించడం సైతం ఆయన వెనుకడుగుకు దారితీసింది. మరోవైపు కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకోవడం.. పైకి మాత్రం మర్యాదపూర్వకమేనని చెబుతున్నా.. అంతర్గతంగా కాంగ్రెస్‌కు సహకరిస్తారనే ప్రచారం కూడా రంజిత్‌ను గందరగోళంలోకి నెట్టింది. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి పోటీకి దూరంగా ఉండడమే మేలనే అభిప్రాయానికి వచ్చిన ఆయన కొన్నాళ్లుగా మౌనముద్ర దాల్చారు. ఈ పరిణామాలతో ఆత్మరక్షణలో పడ్డ బీఆర్‌ఎస్ హైకమాండ్ రంజిత్ వెనుకడుగుతో ప్రత్యామ్నాయంగా పలువురు పేర్లను పరిశీలించింది. మొదట మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ పేరు పరిశీలించినా ఆయన నిర్ణయంపై స్పష్టత రాకపోవడంతో మాజీ మంత్రి సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి పేర్లు తెరమీదికి వచ్చింది. ఆయన కూడా ఆసక్తి చూపలేదని తెలిసింది. ఆ తర్వాత జెడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వంపై మొగ్గు చూపింది. ఆయన కాకపోతే కనీసం కుమారుడు వీరేశ్‌నైనా రంగంలోకి దించాలని గులాబీ దళపతి భావించారు. దీనిపై కాసానితో సంప్రదించిన అధిష్టానం ఎట్టకేలకు ఆయనను పోటీకి ఒప్పించింది. ఇదే విషయాన్ని సోమ వారం జరిగిన సమావేశంలో పార్టీ నేతలకు స్పష్టం చేసింది.

నిధుల కోసమే కలిశాం..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంపై కూడా సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది. నియోజకవర్గం అభివృద్ధి నిధుల అంశంపైనే తామంతా సీఎంను కలవాల్సి వచ్చిందని.. ఇందులో రాజకీయ కోణం లేదని వారు వివరణ ఇచ్చినట్లు సమాచారం. సమావేశంలో మాజీ మంత్రి సబితారెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్ సహా యువ నేతలు కార్తీక్‌రెడ్డి, కాసాని వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

'హస్త'గతం చేసుకుంటాం

- చేవెళ్ల ఎంపీ స్థానాన్ని సీఎంకు బహుమతిగా ఇస్తాం
- బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరడం సంతోషం
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో కైవసం చేసుకోవడం ఖాయమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నర్సింలు, అంజిల్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, మాజీ సర్పంచులు ప్రకాశం, గెమ్యా నాయక్, రాంచంద్రయ్య, లక్ష్మణ్, ప్రకాశం, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ తోపాటు సుమారు 100 మందికి పైగా కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు నియోజకవర్గంలో వర్గ భేదాలు రాకుండా చూస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారికి అందేలా చూడాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకులు మైపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఎల్. నర్సింలు, ఎల్లారెడ్డి, ఉత్తమ్ చందు, ఆంజప్ప, ప్రవీణ్‌కుమార్, రమేష్‌కుమార్, విద్యాసాగర్, రవిశంకర్, బంద్యప్ప, డీ నర్సింలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

విద్యతోనే సమాజంలో గౌరవం

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఘనంగా మహిళా దినోత్సవం

వికారాబాద్ అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి సమాజాన్ని ముందుకు నడిపించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమెన్స్‌డేను నిర్వహించారు. మహిళా అధికారులు, సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. మహిళలు కూడా పెట్టుబడులు పెట్టి పురోగతిని సాధించాలన్నారు. సమాజంలో లింగ వివక్షత పూర్తిగా రూపు మాపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటి నుంచే మహిళలను ప్రోత్సహించడం ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలు, మగ పిల్లలు అనే తేడా లేకుండా విద్యలో ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎన్నో రంగాల్లో రాణిస్తూ వారి నైపుణ్యాన్ని చాటుతున్నారని పేర్కొన్నారు. మరింత ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు అరికట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సూపర్ వైజర్లు తల్లిదండ్రుల్లో చైతన్యం నింపి బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జ్యోతిపద్మ మాట్లాడుతూ.. లింగ వివక్ష లేకుండా పిల్లలను పెంచాలని సూచించారు. మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేశం, సభ్యులు ధనసిరి ప్రకాష్, మైనార్టీ వెల్ఫేర్ అఫీసర్ సుగుణ, గ్రౌండ్ వాటర్ అధికారిని దీపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనాలను పూర్తి చేయండి

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాలను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంబంధిత శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ భవనం లేని ఊరు జిల్లా ఉండరాదన్నారు. సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.



పాల్గొన్న మహిళా అధికారులు

28.. 3.. 12.. 13..

- కొడంగల్‌కు 28 కమ్యూనిటీ భవనాలు మంజూరు చేసిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- ఆరేళ్లలో మూడే పూర్తి
- ప్రారంభానికి నోచుకోని మరో 12
- వివిధ దశల్లో 13
- వెంటాడుతున్న నిధుల కొరత
- కొత్త ప్రభుత్వంపై ఆశలు



కొడంగల్‌లో అసంపూర్తిగా ఉన్న లింగ బలిజ భవనం

కొడంగల్: 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా అప్పటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం పావులు కదిపింది. కుల సంఘాలను అక్కున చేర్చుకునేందుకు కమ్యూనిటీ భవనాలను మంజూరు చేసింది. ఎక్కడా లేని విధంగా ఒక్క కొడంగల్ మండలానికి 28 కమ్యూనిటీ భవనాలను మంజూరు చేశారు. ఆరేళ్లుగా పనుల్లో పురోగతి లేదు. ప్రజలకు హామీ ఇచ్చి ఐదేళ్లు దాటినా పూర్తి చేయలేదు. అప్పట్లో ఆర్భాటంగా ప్రారంభించిన పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.5లక్షల నుంచి రూ.25 లక్షల వరకు కేటాయించారు. మూడు భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. ఉడిమేశ్వరం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రుద్రారంలో లింగాయత్ కమ్యూనిటీ భవనం, కొడంగల్‌లో నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన వాటిలో 12 భవన నిర్మాణాలు ప్రారంభమే కాలేదు. 13 చోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నిధుల కొరత కారణంగా భవనాల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

మున్నూరు కాపులను విస్మరించారు

నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేసిన అప్పటి బీఆర్‌ఎస్ పాలకులు మున్నూరు కాపులకు మాత్రం కమ్యూనిటీ భవనం మంజూరు చేయలేదు. నియోజకవర్గంలోని ఆ సామాజిక వర్గం బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా లేరనే వారికి కమ్యూనిటీ భవనం మంజూరు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలోని 8 మండలాల్లో బలమైన సామాజిక వర్గంగా పేరుగాంచిన మున్నూరు కాపులు ఆత్మగౌరవాన్ని చంపుకొని యాచించలేదు. బీఆర్‌ఎస్ నాయకులు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయకున్నా తాము ఆత్మగౌరవ భవనాలు నిర్మించుకుంటామని ఆ సామాజిక వర్గం ప్రకటించింది. ఈ విషయంపై మున్నూరు కాపు ప్రతినిధులు మాట్లాడుతూ.. కొడంగల్‌తో పాటు నియోజకవర్గం పరిధిలో ఒక్క భవనం కూడా మంజూరు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని కొడంగల్‌లో మున్నూరు కాపుల ఆత్మగౌరవ భవనానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని సంఘం నాయకులు కోరుతున్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి



కడా కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నేతలు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య

కొడంగల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కోరారు. సోమవారం పట్టణంలోని కడా కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు రెగ్యులర్‌గా జీతాలు రావడం లేదన్నారు. సీఐటీయూ అనుబంధ సంఘమైన తెలంగాణ గ్రామ పంచాయ తీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆరు నెలలుగా వేతనాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్మికులను పర్మనెంట్ చేసి వేతనాలు పెంచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా కల్పించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, డంపింగ్ యార్డ్, హరితహారం, పల్లెప్రకృతి వనం, వైకుంఠ ధామాలు తదితర పనులను పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేస్తున్నారని అన్నారు. వారిని పర్మినెంట్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికులకు నెలకు రూ.9500 ఇస్తున్నారని అవి కూడా సకాలంలో రావడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీ యూ నాయకులు సాయిలు, దస్తప్ప, నారాయణ, రాజు పాల్గొన్నారు.

బస్సులు ఆపాలంటూ మహిళల ఆందోళన

- తొండుపల్లి ప్రధాన రహదారిపై బైఠాయింపు
- భారీగా నిలిచిపోయిన వాహనాలు
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ

పరిగి: మహిళల కోసం ప్రభుత్వం ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నా ఆర్టీసీ సిబ్బంది బస్సులు ఆపడం లేదని మహిళలు ఆరోపించారు. సోమవారం ఆర్టీసీ సిబ్బంది తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ఘటన పరిగి మండలం తొండపల్లిలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. పరిగి – షాద్‌నగర్ బస్సులు తొండుపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయని, అయినా గ్రామంలో బస్సులు ఆపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది తీరును ఆర్టీసీ డిపోలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గంటకు పైగా మహిళలు రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళలతో చర్చించారు. ఆర్టీసీ డీఎంతో మాట్లాడి బస్సులు ఆపేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



బస్సును అడ్డగించి నిరసన తెలుపుతున్న మహిళలు



కోరం లేకపోవడంతో సమావేశం నుంచి బయటికి వచ్చిన కార్పొరేటర్లు

గట్టెక్కిన మీర్‌పేట మేయర్

కోరం లేక వీగిపోయిన అవిశ్వాసం

మీర్‌పేట: బీఆర్‌ఎస్ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. నెల రోజులుగా స్థానికంగా నెలకొన్న ఉత్కంఠకు చివరికి తెరపడింది. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్‌పై అవిశ్వాసం కోరుతూ సొంత పార్టీ కార్పొరేటర్లతో పాటు బీజేపీ, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మరికొందరు కార్పొరేటర్లు మొత్తం 31 మంది గత నెల 22న కలెక్టర్‌కు లేఖ అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ అధికారి, కందూకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 11.30 గంటలు దాటినా సమావేశానికి సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో ఆర్డీఓ 12 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మొదటి నోటీసు జారీ చేశారు. ఆ తరువాత 12.30 గంటలకు క్యాంపు నుంచి నేరుగా కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా సమావేశానికి హాజరయ్యారు. సమావేశం జరగడానికి, అవిశ్వాసానికి మొత్తం 31 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా, 29 మందే ఉండడంతో కోరం లేని కారణంగా అవిశ్వాసం వీగిపోయింది. ఈ సందర్భంగా మేయర్ పదవి ఆశించిన నీలారవినాయక్ మాట్లాడుతూ.. ఇప్పుడున్న మేయర్‌పై వ్యతిరేకత ఉండడంతోనే మొదట 35 మంది కార్పొరేటర్లు తమకు మద్దతు తెలిపారని, చివరకు ప్రలోభాలతో ముగ్గురు సభ్యులు సమావేశానికి రాలేకపోయారని ఆరోపించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్డీఓ, ప్రిసైడింగ్ అధికారి సూరజ్‌కుమార్ మాట్లాడుతూ.. అవిశ్వాసం నోటీసు ఇచ్చినప్పుడు 31 మంది సభ్యులు ఉన్నారని, సమావేశానికి 29 మందే హాజరయ్యారని అన్నారు. కోరం లేనందున సమావేశాన్ని నిర్వహించలేమని, అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు.

క్లుప్తంగా

వ్యక్తి మృతదేహం లభ్యం

యాలాల: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బస్ స్టేషన్ సమీపంలో గల సర్వే నంబరు 285లో గుర్తు తెలియని వ్యక్తి(45) మృతదేహం ఉందన్న సమాచారం అందింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించగా.. చెప్పులు, టవల్ లభించినట్లు ఎస్ఐ తెలిపారు. మృత దేహాన్ని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఘటనా స్థలంలో బైక్, టిప్పర్

కొడంగల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన పట్టణంలోని ప్రధాన రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ భరత్‌రెడ్డి కథనం ప్రకారం.. బొంరాస్‌పేట మండలం నాస్కన్‌పల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి(40) ఏపీ22 ఏఎల్ 8043 నంబర్ బైక్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న టీఎస్31 టీ 2504 నంబర్ గల టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. కొందరు స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా.. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ ఈశ్వరప్ప.. కొడంగల్ మండలం ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

లైంగిక దాడి చేశాడంటూ నర్సు ఫిర్యాదు

తాండూరు టౌన్: ఆర్ఎంపీ వైద్యుడు తనకు మత్తు మందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడినట్లు ఓ నర్సు సోమవారం తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 21న పట్టణానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అహ్మద్ తన వద్ద పనిచేసే నర్సుకు మత్తు మందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అయితే నర్సుపై లైంగిక దాడికి పాల్పడిన వీడియోను ఆర్ఎంపీ వైద్యుడు గత నెల ఓ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. దీంతో గ్రూపు సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఇప్పటికే అతనిపై అశ్లీల వీడియోను పోస్టు చేసినందుకు ఓ కేసు నమోదు చేశామన్నారు. తాజాగా లైంగిక దాడి కేసు కూడా నమోదు చేసినట్లు చెప్పారు.

కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

కేశంపేట: ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం ఉపాధి కూలీలతో తెలంగాణ వ్యవసాయ కార్మిక స ంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గత సంవత్సరం ఉపాధి కూలీలకు రావాల్సిన బిల్లులను ఇవ్వలేదన్నారు. దీంతో కూలీలు పనులు మానేశారని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని తీసుకువచ్చి, నిరుపేదలకు అండగా నిలిచిందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం.. పథకానికి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, దామోదర్‌రెడ్డి, రామయ్య, నిర్మల, రత్నమ్మ, శంకరయ్య, కిష్టమ్మ పాల్గొన్నారు.

భార్యను కిడ్నాప్ చేశారంటూ ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్: తన భార్యను ఎత్తుకెళ్లారని ఓ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉర్కొండ మండలం, జాకినాల్‌పల్లి గ్రామానికి చెందిన పోలే ప్రవీణ్‌కుమార్, రాధికలు ప్రేమ వివాహం చేసుకొని ఫిబ్రవరి 19 నుంచి రావిర్యాల్ గ్రామంలో అద్దెకు ఉంటున్నారు. పక్కనే ప్రవీణ్ కుమార్ సోదరి మమత ఉంటుంది. అతడు భార్యను ఇంట్లోనే వదిలిపెట్టి సోమవారం బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రవీణ్ భార్యతో అతని బంధువులు గొడవపడ్డారు. అనంతరం కారులో రాధికను తీసుకొని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని మమత ప్రవీణ్‌కు ఫోన్ చేసి తెలిపింది. దీనిపై అతడు ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రక్తమోడుతున్న రహదారి

నేషనల్ హైవేపై అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనుకోని ఘటనలు రెప్పపాటులో జరిగి, అనేక మంది ప్రాణాలు విడుస్తున్నారు. గడిచిన కాలంలో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. కారణం ఏదైనా రక్తసిక్తం అవుతున్న రహదారిలో.. ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారుల చర్యలు శూన్యం!

- హైదరాబాద్–బీజాపూర్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న ప్రయాణికుల ప్రాణాలు
- సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు కరువు
- వేగనియంత్రణ చర్యలు చేపట్టని పోలీసులు



సోమన్‌గుర్తి గేటు వద్ద జరిగిన ప్రమాదంలో కారులో ఇరుక్కుని మృతి చెందిన విజయ్‌శేఖర్

పూడూరు: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి.. నిత్యం ప్రమాదాలతో రక్తసిక్తం అవుతోంది. ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధి జాతీయ రహదారిపై గత నెల 18న నారాయణపేట జిల్లా మద్దూరు మండలం నందిగామ గ్రామానికి చెందిన నాగంపల్లి శ్రీనివాస్(22), సిద్దిపేటకు చెందిన చందు(24) ఇద్దరు హైదరాబాద్‌కు వెళ్తుండగా.. అంగడిచిట్టంపల్లి గేటు వద్ద చోటుచేసుకున్న ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

వరుస ఘటనలు

గడిచిన కాలంలో ఇదే మార్గంలో జరిగిన ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు విడిచారు. అంగడిచిట్టంపల్లిలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ప్రమాదంలో చనిపోగా.. కండ్లపల్లి గేట్ వద్ద ఆలూరు పాఠశాలలో పని చేస్తున్న కృష్ణ కుమార్‌గౌడ్ లారీ ఢీ కొన్న ఘటనలో మృత్యువాత పడ్డాడు. దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన పూరి రమేష్(32), అతడి భార్య సుష్మ(28), కూతురు ప్రణవి(10)లతో కలిసి వారం రోజుల క్రితం విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా.. సోమన్‌గుర్తి గేటు వద్ద జరిగిన ప్రమాదంలో సుష్మ చనిపోయారు. అదే ప్రాంతంలో కారు, సిమెంట్ ట్యాంకర్ ఢీ కొన్న ఘటనలో కారు డ్రైవింగ్ సీట్లో ఉన్న విజయ్ శేఖర్ ఘటనా ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు.

బ్లాక్‌స్పాట్‌గా గుర్తింపు

హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా.. పోలీసులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధి అయిన జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఆర్‌అండ్‌బీ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ, పోలీసు అధికారులు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించినా.. ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోవడం లేదు.

తగిన చర్యలు చేపట్టాలి

ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. డేంజర్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో వేగనియంత్రన సూచిక బోర్డులు పెట్టాలి. బారికేడ్లు ఏర్పాటు చేయాలి. బీజాపూర్ రోడ్డుపై అధికంగా మలుపులు ఉన్నాయి. వాటి వద్ద స్పీడ్ బ్రేకర్లను నిర్మించాలి.

– రాములు, మాజీ సర్పంచ్, చీలాపూర్

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. వేగ నియంత్రణకు స్పీడ్‌గన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో బ్లాక్‌స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో సూచిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. రోడ్డు ప్రమాదాలు జరగకుండా, వేగంగా వెళ్లకుండా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ, చన్గోముల్

మా భూమి మాకు ఇప్పించండి..

- భూ బాధిత కుటుంబ సభ్యుల నిరసన
- చట్టప్రకారమే ఇతరుల పేరిట బదలాయింపు
- తహసీల్దార్ కిషన్ వివరణ



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహబూబీ

పెద్దేముల్: 'మా భూమి మాకు ఇప్పించండి. భూమి కోసం 16 ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. న్యాయం జరగడం లేదు' అని బాధితురాలు మహబూబీ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. సుమారు గంటకు పైగా బైఠాయించి, న్యాయం చేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించడంతో రెవెన్యూ అధికారులకు పోలీసులకు సమాచారం అందజేశారు.

నిబంధనల మేరకే..

మండల పరిధి కందనెల్లి గ్రామానికి చెందిన 243 సర్వే నంబర్‌లో మహబూబీకి 3.03 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దానిని 2007లో సాదాబైనామా పేరుతో అదే గ్రామానికి చెందిన మొగులప్పకు 1.22 ఎకరాలు, నర్సప్పకు 1.21 ఎకరాల భూమిని బదలాయించారు. ప్రభుత్వం ప్రొసిడింగ్ కూడా జారీ చేసింది. ఈ విషయం తెలుసుకున్న మహబూబీ, ఆమె కుటుంబసభ్యులు కొంతకాలంగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమ ప్రమేయం లేకుండా.. మా భూమిని వేరే వ్యక్తుల పేరు మీద మార్చారంటూ ఆరోపించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇదే విషయంపై తహసీల్దార్ కిషన్‌ను వివరణ కోరగా.. 2008–ఆర్ఓఆర్ చట్టం ప్రకారం మహబూబీ పేరు మీద నుంచి మొగులప్ప, నర్సప్పలకు మారిందన్నారు. మహబూబీ వేసిన పిటిషన్‌ను స్పెషల్ ట్రిబ్యునల్ కోర్టు కొట్టేసిందని, సివిల్ కోర్టుకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అయినా వారు వినకపోవడంతో నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

మహిళాభ్యున్నతికి మోదీ చేయూత

ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

మహేశ్వరం: మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు పధాని నరేంద్రమోదీ 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్సీ ఎ.వెంకట నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మాణిక్యమ్మగూడ గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎరువుల కంపెనీ, కేంద్ర రసాయన, ఎరువుల మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో అన్నదాతలకు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ప్రధాని మోదీ దీదీ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. 21వ శతాబ్దంలో భారతదేశ సాంకేతిక విప్లవానికి నారీ శక్తి నాయకత్వం వహిస్తుందన్నారు. నేడు మహిళలు ఐటీ, అంతరిక్షం సైన్స్ రంగాలతో పాటు ఇతర రంగాల్లో రాణిస్తున్నారన్నారు. గ్రామీణా ప్రాంత మహిళలు లక్షధికారులుగా మార్చేందుకు ప్రధాని కృషి చేస్తున్నారని తెలిపారు.

మాట నిలబెట్టుకుంటాం



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు తదితరులు

గ్యారంటీల అమలుకు కృషి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

చేవెళ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలకు కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన బీంభరత్ అధ్యక్షతన సోమవారం పార్లమెంటు ఎన్నికలపై నియోజక వర్గ స్థాయి నాయకుల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలు మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ, అని ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీలను అమలు చేస్తుందని చెప్పారు. రేపు మహిళలకు రూ.2, 500ల పింఛన్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించే పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ట్రిబుల్ ఆర్ రోడ్డు..

చేవెళ్ల మీదుగా ఉన్న హైదరాబాద్–బీజాపూర్ రోడ్డు పనులను త్వరలోనే సీఎం ప్రారంభిస్తారని, ట్రిబుల్ ఆర్ రోడ్డు కూడా రాబోతుందని చెప్పారు. జీఓ 111పై కూడా సీఎంతో చర్చించడం జరిగిందని, దీనిపై కూడా త్వరలో పార్టీ నిర్ణయం తీసుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ విధ్వంసం చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సునీతారెడ్డికి ఎంపీ టికెట్ గ్యారంటీ

పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పట్నం సునీతారెడ్డికే టికెట్ వస్తుందని, ఆమెను భారీ మెజార్టీ తో గెలిపించేందుకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని నాయకులు పామెన భీంభరత్, చల్లా నర్సింహారెడ్డి, గౌరీ సతీష్, పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, వెంకటస్వామి, జనార్దన్‌రెడ్డిలు అన్నారు. కార్యక్రమంలో నాయకులు వసంతం, దర్శన్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆగిరెడ్డి, డీవీఆర్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బల్వంత్ రెడ్డి, శివకుమార్, పెంటారెడ్డి, శ్రీను, పెంటయ్యగౌడ్, ప్రభాకర్, పాల్గొన్నారు.

'కృత్రిమ కాళ్ల' శిబిరానికి స్పందన



శిబిరానికి తరలి వచ్చిన బాధితులు



కృత్రిమ కాళ్లు అమర్చేందుకు కొలతలు తీసుకుంటున్న నిర్వాహకులు

తొలిరోజు వంద మందికి అమర్చిన నిర్వాహకులు

తాండూరు టౌన్: మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు హర్షణీయమని ఆర్బీఓఎల్ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. యువమంచ్, రాడికల్ బయో ఆర్గానిక్ కెమికల్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన జైపూర్ కృత్రిమ కాళ్లు, క్యాలిపర్ల అమరిక శిబిరాన్ని ఆయన ప్రారంభించగా.. అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడారు. రక్తదానం, నేత్రదానం, కృత్రిమ అవయవ దానంతో పాటు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవల్లో ఆర్బీఓఎల్ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. యువమంచ్ అధ్యక్షుడు బ్రిజ్ మోహన్ బూబ్ మాట్లాడుతూ.. ఏటా నిర్వహించే విధంగానే ఈ సారి కూడా 200 మందికి కృత్రిమ జైపూర్ కాళ్లు, క్యాలిపర్ల అమరిక చేపట్టామని తెలిపారు. ఈ శిబిరానికి కొడంగల్, చించోళి, గుల్బర్గా, పరిగి, వికారాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 100 మందికి కొలతలు తీసుకున్నామని పేర్కొన్నారు. నేడు, రేపు కూడా మరింత మందికి అవకాశం ఇస్తామన్నారు. అనంతరం రెండు రోజుల్లో కృత్రిమ కాళ్లను అమరుస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్బీఓఎల్ డైరెక్టర్లు అశోక్, రాధాకృష్ణ, రాజస్థాని ప్రగతి సమాజ్, యువమంచ్ సభ్యుడు మురళీధర్ గగరాని, కుంజ్ బిహారీ సోని, బ్రిజ్ మోహన్‌బూబ్, కిషన్ రాఠి, అరుణ్ సార్డా, మన్మోహన్ సార్డా, మంచ్ పెద్దలు, రాజస్థానీ మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ, ముగ్గురికి గాయాలు

ఆమనగల్లు: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాం వివరాల ప్రకారం.. ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రసాద్, తన ద్విచక్ర వాహనంపై ఆకుతోటపల్లి ఉన్నత పాఠశాలకు విధుల నిమిత్తం వెళ్తున్నాడు. ఈ క్రమంలో జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ ఉపాధ్యాయున్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ప్రసాద్‌తో పాటు, ప్రమాదానికి కారణమైన ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన దార్ల రాములు, లక్ష్మణ్‌లు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రసాద్‌ను వెల్దండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, రాములు, లక్ష్మణ్‌లను హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

'ఈసీ'కి భువనగిరి ఎంపీ టికెట్ ఇవ్వండి

- ఎమ్మెల్యే రంగారెడ్డిని కోరిన కాంగ్రెస్ శ్రేణులు
- కష్టపడిని వారిని పార్టీ గుర్తిస్తుందన్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం రూరల్: బడుగు బలహీన వర్గాల నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్‌కు భువనగిరి పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం 400 మంది పార్టీ శ్రేణులు శేఖర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఎలాంటి పదవులు ఇవ్వకున్నా.. సుదీర్ఘ కాలంగా పార్టీ కోసం శేఖర్ పనిచేస్తున్నారని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. శేఖర్ సేవలను గుర్తించి, భువనగిరి పార్లమెంటు సీటు ఇప్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని అధిష్టానం గుర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ఆర్తిక, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ఏబ్లాక్ పార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ నారాయణరెడ్డి, యాచారం మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, యాచారం మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, కిసాన్‌సెల్ అధ్యక్షుడు బుగ్గరాములు, హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్ యాదవ్, వాజిద్, ముచ్చర్ల వెంకటేశ్, బాలయ్య, జంగయ్య, సతీష్, బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

చేవెళ్ల: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి విజయానికి నాంది అని వాలీబాల్ టోర్నీ నిర్వాహకులు అన్నారు. జాతీయ క్రీడాకారుడు బోడ అనిల్‌కుమార్ స్మారకార్థం చేవెళ్ల మండలం దామరగిద్ద గ్రామంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో రెండురోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ టోర్నీ ఆదివారం రాత్రితో ముగిశాయి. రెండు విభాగాలుగా జరిగిన ఈ పోటీల్లో.. దామరగిద్ద జట్టు ప్రథమ స్థానంలో నిలవగా.. రన్నరప్‌గా షాదన్‌గర్ జట్టు, తృతీయస్థానంతో అజీజ్‌నగర్ జట్టు సరిపెట్టుకుంది. ఈ సందర్భంగా విజేతలకు మాజీ సర్పంచులు వెంకటేశం గుప్తా, మధుసూదన్ గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు.

వచ్చేసింది.. పవిత్రమాసం

- నేటి నుంచి రంజాన్ దీక్షలు ప్రారంభం
- నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టనున్న ముస్లింలు
- ప్రార్థనలకు ముస్తాబైన మసీదులు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

షాబాద్/ పహాడీషరీఫ్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు చేస్తారు. వీటితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరనున్నాయని మత పెద్దలు, వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మంగళవారం నుంచి దీక్షలు ప్రారంభం కానుండగా.. నెల రోజుల పాటు.. నియమం తప్పకుండా, వయోభేదం లేకుండా అత్యధికులు ఉపవాస దీక్షలను.. చేపట్టనున్నారు.

ప్రయోజనాలు..

ఉపవాస దీక్షల వలన ఎన్నో భౌతిక ప్రయోజనాలు చేకూరుతాయి. ముఖ్యంగా ఆరోగ్యంలో సమతుల్యత ఉంటుంది. రక్త ప్రసరన వ్యవస్థ బాగు పడుతుంది. గుండె నొప్పి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. జీర్ణవ్యవస్థకు రోజుకు సుమారు 14గంటల పాటు విశ్రాంతి లభిస్తుంది. దీనికి లివర్, చిన్నపేగులు, జీర్ణాశయాలు మొదలు అవయవాలు నూతనోత్తేజం పొందనున్నాయి. ఇదే విషయాన్ని.. ప్రపంచ స్థాయి ఆరోగ్య నిపుణులు మైకిల్‌జోసప్, శ్యామెల్, డాక్టర్ ఖాన్‌తో పాటు అనేకమంది వైద్యనిపుణులు ఈ రోజును ఆరోగ్యం కాపాడే మహిమగల విధానమని తమ ప్రయోగాలతో నిరూపించారు.

రక్త ప్రసరణ సాఫీగా..

సంవత్సరంలో 11నెలల పాటు రోజుకు 3 పూటలా భోజనం, మధ్యలో చిరుతిండ్లు, కాఫీ, టీలు తీసుకోవడం వలన జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి లేకుండా పోతుంది. ఏడాదిలో నెల రోజుల పాటు విధిగా ఉపవాస దీక్షలు పాటించడం వలన.. శరీరంలో బాగా వేడి పుట్టి పేగుల్లో పేరుకుపోయిన కొవ్వు కరిగిపోతుంది. రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. శరీరం తేలిక పడుతుందని దీక్ష చేపట్టే వారు స్పష్టం చేస్తున్నారు.

ఏర్పాట్లు ముమ్మరం..

నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుండటంతో.. పహాడీషరీఫ్ జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు.. ముస్లిం బస్తీల్లో పారిశుద్ధ కార్యక్రమాలు ముమ్మరం చేశారు. మసీదులకు వచ్చిపోయే దారుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. మసీదుల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

పోలీస్ బందోబస్తు

రంజాన్ నేపథ్యంలో బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తపేట, ఎర్రకుంట, ఉస్మాన్‌నగర్, షాహీన్‌నగర్, వాదే సాల్హె హీన్, న్యూ బాబానగర్, క్యూబాకాలనీ, పహాడీషరీఫ్, జల్‌పల్లి ప్రాంతాల్లోని మజీదుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

నియమ నిష్టలతో దీక్ష

ఇస్లాం నాలుగో మూల స్తంభం ఉపవాసం. నమాజ్ వలే.. ఉపవాసం కూడా అన్ని యుగాల్లో ప్రవక్తలందరిపై విధిగా చేయడం జరిగింది. గతించిన సమాజాల్లో ఉపవాసాలు పాటించేవారు. ఉపవాసాల సంఖ్య వాటిని పాటించే రుతువులు, కాలాలలో తేడా ఉండేది. ప్రతి మతంలో ఉపవాసాన్ని పాటించడాన్ని చూస్తున్నాం. కానీ.. ముస్లిం సమాజం త్రికరణ శుద్ధితో ఆచరించే ఆరాధన వ్రతం ఉపవాసం ప్రత్యేకంగా చూస్తారు. దీన్ని అరబిక్ భాషలో సౌమ్ గాను, వ్యవహారిక ఉర్దూ భాషలో రోజాగా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 9వ నెల అయిన రంజాన్ మాసంలో ఈ ఆరాధన వ్రతాన్ని పాటిస్తారు. ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో సౌమ్ అంటే ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తినడం, తాగడం, మనో వాంఛలకు దూరంగా ఉండడం.

ఇబ్బంది లేకుండా చర్యలు



రంజాన్ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. 30 రోజుల పాటు మజీద్‌ల వద్ద పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సదుపాయం కల్పిస్తాం. రాత్రి పూట నమాజ్‌లు చేయడాన్ని దృష్టిలో ఉంచుకొని లైటింగ్ సదుపాయం కూడా కల్పించాం.

– అల్లూరి వాణి రెడ్డి, జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్

దీక్ష విధానాలు

సహర్: తెల్లవారు జామున 4:30 గంటల కల్లా తీసుకునే ఆహారాన్ని సహర్ అంటారు. సహర్ అనంతరం ఉపవాస దీక్ష ప్రారంభమవుతుంది.

ఇఫ్తార్: సూర్యుడు అస్తమించిన పది నిమిషాల లోపు తీసుకునే ఆల్పాహారాన్ని ఇఫ్తార్ అంటారు. దీంతో ఉపవాస దీక్ష విరమించిన్నట్లవుతుంది.

జకాత్: ధనికులు, పేదలు రంజాన్ వేళల్లో విధిగా పంచే నగదు, ఇతర దానాలను జకాత్‌గా భావిస్తారు. తమ వద్ద కనీసం 52తులాల వెండి, ఏడున్నర తులాల బంగారం, లేదా దానికి సమానమైన విలువగల డబ్బు ఒక సంవత్సర కాలం పాటు నిల్వ ఉంచుకున్న వారు.. అందులో 2.5 శాతాన్ని జకాత్ పేరిట దానం చేయాలి. రైతులైతే తాము పండించిన పంటను ఖర్చు పోను, మిగతా పంటలపై పదోవంతు ధాన్యాన్ని జకాత్‌గా పంచాలి.

తరావీ: తరావీ నమాజ్‌లో 30 అధ్యయనాలు గల ఖురాన్‌ను 26 రోజుల్లో వింటారు. ఖురాన్ కంఠస్థం చేసిన వ్యక్తి (ఆఫీజ్)ని 26వ రోజు రాత్రి సత్కరిస్తారు. తరావీ నమాజ్‌లో ముస్లింలంతా విధిగా పాల్గొంటారు.

ఫిత్రా: ఈ పండుగనే ఈద్‌ఫిత్రా అంటారు. ఈ రోజు నమాజ్ ఆచరించే ముందు కుటుంబసభ్యుల సంఖ్యను బట్టి ఫిత్రా రూపంలో ఒక్కొక్కరి పక్షాన 7.75 కిలోల బరువుగల గోధుమలు లేదా, దానికి సమానమైన నగదును పేదలకు పంచుతారు.